కథానిక

# పరవాహనుల ఔదార్యం

పాలగుమ్మి రామారావు

ఎత్తు వచ్చిందంటే ఎంతటివాడినైనా దింపేస్తుంది. పల్లంవచ్చిందంటేమాత్రంపంచకల్యాణి. బహు స్వతంత్రబుద్ధిగలది. అదే గుమాస్తా గోపాలంగారి సైకిలంటే. దాని కీళ్లు ఎప్పుడూ చమురెరుగక అది నడిచేటప్పుడు ఒకటే కీచురాయి మోత. దాని మెడలో గంటొకటి. అచ్చంగా దేవుడుగుళ్ళో గంటలాంటిది. అసలు దేవతార్చన గదిలోది ఆ గంట. దాన్ని వాహనం మెడలో వేలాడకట్టాడు గోపాలం. అది నడుస్తున్నంత సేపూ గణగణమంటూనే వుంటుంది ఆ గంట. వంకర చక్రాలు అదీ ఆ సైకిల్ నడకతీరే అమోఘం.

ఉదయం ఆరుకావస్తుంటే అప్పటికే ఆలస్యం అయిందనుకుంటూ కొండమీద బంగళాలో కొలువుకు బయల్దేరాడు గోపాలం. వెనకచక్రంవద్ద ఓ కాలుమోపి రెండోకాలుతో నెట్టుకుంటూ వీధిమలుపు సమీపించాక ఎక్కాడు.

ఇంట్లో అబ్బాయికి జ్వరం అలాగేవుంది. ఎవరైనా మంచి డాక్టరుచేత మందు ఇప్పిద్దామంటే ఎప్పుడూ నిత్యదరిద్రమే. న్యాయవాది సుదర్శనం వద్ద తను గుమాస్తాగా చేరి ఇరవై ఏళ్లు దాటింది. ఇరవై ఏళ్లనాటికీఇప్పటికీ చాలామారిందిప్రపంచం. కుడివైపు సుబ్బిశెట్టిగారి మేడవైపుజూస్తూ నిట్టూర్చాడు గోపాలం. ఇరవై ఏళ్ళక్రితం అదేచోటులో ఓ పూరిగుడిసె వుండేది. అందులోకూర్చుని పకోడీలు అమ్ముకుంటూండే సుబ్బిశెట్టి కళ్ళకు కట్టినట్లయ్యాడు. అదేచోటులో క్రమంగా ఓ మహాభవంతి వెలిసింది. అదే సుబ్బిశెట్టి ఇప్పుడో పెద్ద బంగారు వర్తకుడయ్యాడు.

ఒకప్పుడు కూటికిలేకుండా వుండి యిప్పుడు కార్లుకొన్నవాళ్ళను కూడా చాలామందిని ఎరుగును గోపాలం. ఎందులో వుందా ఆ కిటుకు అన్నట్టు పెదవి వొడేసి తీవ్రంగా యోచించాడు. ఆలోచనమాత్రం తెగిందిగాదు. ఒక్క విషయం మాత్రం కనబడుతూనేవుంది. ఎంత కొల్చినా గొర్రెతోక బెత్తడే అన్నట్లు తన జీతం కూడా అంతే. ఇరవై ఏళ్ళక్రితం ఎంతో, ఇప్పుడూ అంతే. ఆ నలభైమాత్రం అలాగే వుండిపోయింది ఎదుగు బొదుగు లేకుండా. జీతం పెంచమని యెప్పుడు అడిగినా మళ్ళీ సంవత్సరాదికి చూద్దాంలెండి అంటూ జరిపేస్తున్నాడు యజమాని. అనేక సంవత్సరాదులు అతని కళ్ళముందు తరలిపోయాయి. కాని ఆ నలభైమాత్రం పెరిగిందిగాదు. ఆవేళ ఏమైనాసరే గట్టిగా అడగాలని నిశ్చయించుకున్నాడు గోపాలం.

ఇంతలో పల్లంవచ్చింది. గణగణ మోగే గంటతో, బ్రహ్మాండంగా కీచుకీచుమంటూ, పట్టపగ్గాల్లేకుండా అసుమేఘాలమీద సాగిపోతోంది ఆ బ్రేకుల్లేని వాహనం. అదిజేసే ఆర్భాటానికి రోడ్డుమీద జనం ఏ గరుడవాహనుడు వస్తున్నాడోనని అదిరిపడి సత్వరంగా పక్కలకు తొలగి నివ్వెరబోయి జూస్తున్నారు ఆవైపు.

కొంతవడికి బంగళాజేరుకున్నాడు గోపాలం. ఆవరణలో కుక్కలు మొరిగాయి అతన్ని జూసి. రోజూ వచ్చేవాడిని చూసికూడా మొరుగుతాయని వాటిని కసురుతూ, సైకిలును ఓ చెట్టుకు చేరవేసి ఆఫీసులోకి వెళ్ళాడు.

ఆవరణలో కుక్కలు మొరుగుతూంటే గుమాస్తావచ్చాడనిగ్రహించారు పలహారంజేస్తున్న సుదర్శనం.

న్యాయవాది సుదర్శనం లక్ష్మీపుత్రుడు. పిత్రార్జితం తాలూకు లభించిన ఓ పెద్ద భవంతి, అరవై ఎకరాల మాగాణీ, స్వార్జితం తాలూకు సాలీనా పదివేలదాకా ఆదాయం జేకూర్చే నగరంలో నల్దెసల బారులుగా కట్టించేసిన అద్దెకొంపలు—ఇవిగాక నెలనెలా ఏడెనిమిది వేలయినా ముట్టజెప్పే ప్రాక్టీసు; ఖరీదైన రెండు కార్లు (ఒకటి ఆయనది, రెండోది పెద్దకొడుకు

గణోశంది;) ఇంట్లో బోలెడు నౌకర్లు; ఇంటి ఆవరణలో రెండు జాతికుక్కలు—అవీ ఆయన స్థితిగతులు.

సుదర్శనం చాలా నేర్పుగల న్యాయవాది. న్యాయవాదవృత్తిలో ఆయన ప్రజ్ఞను గురించి అనేకథగా చెప్పుకుంటూరు ఆ చుట్టుప్రక్కల. అదెంతవరకు నిజమోగాని ఆయనకు "లా"అంతా కంఠస్తం అని, ఆయన చేబట్టిన ఏ కేసయినా నెగ్గితీరుతుందని ప్రతీతి.

ఉదయకాలపు కాఫీ పలహారాలు ముగించుకుని చిరుదగ్గులతో గొంతు సవరించుకుంటూ ఆయన ఆఫీసుగదివైపు బయల్దేరారు. ఆయన ఘనమైన చిరుదగ్గులకు బంగళా అంతా ఉలిక్కిపడింది. అయ్యగారు వస్తున్నట్లు అదే హెచ్చరిక. సేవకుల సంచలనం హెచ్చింది; పరుగుపరుగున చేయసాగారు దినచర్యలు. గుమాస్తా గోపాలం కూడా అంతే. ఫైల్లోని కాగితాలను పరుగులెట్టిస్తూ గౌరవపురస్సరంగా లేచినిలబడ్డాడు సుదర్శనం గారి రాకనుగుర్తించి.

గదిమధ్య తిరుగుడుకుర్చీలో నిండుగాకూర్చుని ఆవేళ వాయిదాకివున్న కేసులు తీసుకురమ్మన్నారాయన. "చిత్తం"అంటూ ఆ పనికి పూనుకున్నాడు గోపాలం; కొంతవడికి కేసుల దస్త్రాలన్నీ సుదర్శనంగారి చేరువలోనున్న బల్లపై పేర్చి అణుకువ ఒలికిస్తూ అక్కడే నిల్చాడు.

స్తిమితంగా స్పెన్సరు చుట్టొకటి అంటించి తిరుగుడు కుర్చీలో మెల్లగా, విలాసంగా, గుండ్రంగా తిరుగుతూ కేసులు స్టడీచేసుకుంటున్నారు సుదర్శనం. కొంతవడికి ఏదో ఆలోచిస్తూ తలెత్తేసరికి అక్కడే నిలబడివున్న గోపాలం కంటబడ్డాడు. వెంటనే తట్టింది ఎందుకు నిలబడ్డాడో. మంచీచెడ్డా లేదు వీళ్లకి అనుకున్నారు సుదర్శనం. కొత్తసంవత్సరం వచ్చిందంటేచాలు. ఇక మొదలు పీక్కుతినడం జీతాలుపెంచమని. నోట్లోని చుట్ట పొగను విసురుగా బయటికి ఊదేస్తూ "ఊరికే నిల్చోకపోతే మిగతా పని జూసుకోకూడదూ" అని కసిరారు సుదర్శనం. ఆకసురుకి గోపాలం తల వెనక్కు జంకింది. అద్దంపోయిన కళ్ళజోడులోంచి ఒక్క అపూర్వమైన చూపు చూసి "చిత్తం"అన్నాడు. వెనుదిరుగుతూ ఓ క్షణం తటపటాయించాడు ఏదో చెబుదామని; కాని నోరుపెగిలి మాటరాలేదు. ఆ ప్రయత్నం విరమించుకుని తన సీటుదగ్గరకు సాగిపోయాడు. సుదర్శనం మొహం విసుగ్గాపెట్టి చూసీచూడనట్లు వూరుకున్నారు. గోపాలం వెళ్ళిపోయాక ఏమేటో ఇదో పెద్దన్యూసెన్సు అయిపోయిందని సణుగుతూ ఆరిపోయిన చుట్టను అగ్గిపుల్లగీశారు. అటుపిమ్మట చుట్టను తిప్పితిప్పి గుప్పుతూ "నైతికంగా ఎంత భ్రష్టులయ్యారు ఈమానవులు"అని వాపోతున్నట్లు కొంచెంసేపు ఇంటికప్పువైపు జూచి తిరిగి కేసులు చూసుకోవడంలో మునిగిపోయారు సుదర్శనం.

ఇంతలో వీరయ్య ప్రవేశించాడు"దన్నాలండి అయంగోరూ"అంటూ. వీరయ్య సుదర్శనంగారి భూముల్లో కొంతభాగాన్ని కౌలుకు జేస్తున్న రైతు. బొద్దుమీసాలు, పెద్దతలపాగా, మోకాళ్లపైకి ఎగకట్టిన పంచెకట్టు, చేతివేళ్ళకి వెండి వుంగరాలు, చేతిలో ఓ బడిత కర్ర, కాళ్ళకి కిర్రు చెప్పులు-అతన్ని చూస్తూనే "ఏమిటి" అన్నారు సుదర్శనం విసుగ్గా.

"ఈవేళ కేసు ఆయిదా కదండీ మా దొడ్డితగాది"అన్నాడు వీరయ్య.

"మిగతాలెక్క పట్టుకొచ్చావామరి"అన్నారు సుదర్శనం.

"అయ్‌బాబో ఇక పాతికే కదండి యియ్యాల మూడొందలకీను. రేపు లెక్కందగానే ఇచ్చెయ్యుండీ"అన్నాడు వీరయ్య.

"ఈ వాయిదాకి వెళ్ళకపోతే కేసు కొట్టేస్తారు తెలుసా!"అన్నాడు సుదర్శనం.

"బాబ్బాబు ఈ అయిదాకివచ్చి మాట దక్కించండి. రేపు తెల్లార్తోనే లెక్క అందించేత్తాను" అన్నాడు వీరయ్య.

"మీ వ్యవహారాలు సుప్రీంకోర్టుకు వెళ్ళినా తిరుగులేకుండా నేను చక్కపెడుతూండడమూను టైముకి మీరు ఫీజు ఆయినా చెల్లించకపోవడమూనా. బలేబాగుంది"అన్నారు సుదర్శనం.

వీరయ్య కాళ్ళవేళ్ళబడి బతిమాలాడు. ఆఖరి మాటగా అన్నారు సుదర్శనం—

"చూడు వీరయ్యా, అదంతా ఏం కుదరదుగాని ముందు మిగతా లెక్క జమకట్టేసెయ్."

ఇకలాభంలేదని తలపాగా సర్దుకుంటూ దారితీశాడు వీరయ్య. అతడు వెళ్ళిపోతుంటే "ఈ వాయిదాకి గనక నన్ను పంపించకపోతే కథంతా

అడ్డం తిరుగుతుంది సుమీ. తర్వాత నన్ను అని ప్రయోజనం లేదు" అంటూ హెచ్చరించారు సుదర్శనం. వీరయ్య ఏదో గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

సుదర్శనం కోర్టుకు బయల్దేరుతూ మిగతా అద్దెలు వసూలుచేసుకురమ్మన్నారు గోపాలాన్ని. గోపాలం సైకిలెక్కి బయల్దేరాడు.

వసూలు అయినకాడికి అద్దె మొత్తాన్ని మూట కట్టుకుని గోపాలం రోజుకుంటూ రొప్పుకుంటూ పాతసైకిలూ తనూ కొండమీద బంగళా చేరుకునేసరికి మధ్యాహ్నం మూడున్నరయింది. సుదర్శనం యింకా కోర్టునుంచి రాలేదు. ఆఫీసుగదిలోకిపోయి కూర్చున్నాడు గోపాలం.

మిగతా ఇళ్ళ అద్దెలన్నీ వసూలయ్యాయిగాని పచ్చమేడతాలూకు రెండు నెల్ల అద్దెకు ఏం సంజాయిషీ చెప్పాలో పెద్దసమస్యగా తయారయింది గోపాలానికి. ఆమేడతాలూకు ఆ నెలఅద్దెమాత్రమే గాక రాబోయే నెలదికూడా నాన్నగారు అడిగి పట్టుకురమ్మన్నారని చెప్పి వసూలు చేసుకుపోయాడుట సుదర్శనంగారి పెద్దబ్బాయి గణేశం. అది ఈపాటికి ఏ పేకాటలోనో ఖర్చయిపోయి వుంటుంది. అడిగి ఏంలాభం ఆ అబ్బాయిని. ఐనా గణేశాన్ని నిలదీసి అడగడానికి ఎవరికి దమ్ములున్నాయి? అది సుదర్శనంగారికే చేతగానిపని. ఆయనకు అద్దెకొరత తెలిసినదగ్గిర్నుంచీ కొడుకుని ఏమీ అనలేక గుమస్తామీద కారాలు మిరియాలు నూరుతారు. అనంతా గుమాస్తాయొక్క అజాగ్రత్తకింద జమకట్టేసి మాట్లాడుతారాయన. మొన్న జరిగిన ఓ సంఘటన జ్ఞాపకం వచ్చింది గోపాలానికి. సుదర్శనం కొడుకుని ఎంతవరకూ అదుపుఆజ్ఞలలో పెట్టగలడో ఆసంఘటనే చాటుతుంది. అప్పుడే ఓ పార్టీయిచ్చివెళ్ళిన మూడొందలూ సుదర్శనం డ్రాయర్లో పెడుతుంటే గణేశం ఎల్లాకొట్టేశాడు ఆ డబ్బు. గెద్దలావచ్చి తన్నుకుని పోయాడు. పోతూపోతూ "బై బై డేడీ" అంటూ సుదర్శనాన్ని కిస్ చేసికూడా పోయాడు. సుదర్శనం నోరువిప్పి పల్లెత్తుమాటంటే ఒట్టు. ఒణుకుతూ పిల్లి పిల్లలా జూశారు మూడొందలు చేతబుచ్చుకుని వెళ్లిపోతున్న కొడుకువైపు. ఆ సంఘటన తల్చుకుంటూ "అబ్బ, అంత గారం ఏమిటో" అనుకున్నాడు గోపాలం. అంతంత మొత్తాలు కొడుకు పట్టుకుపోయి వృథాగా పేకాటల్లోను, రేసెస్‌లోను ఖర్చుపెడుతున్నా సుదర్శనంగారికి మనసు ఒప్పుతుందిగాని ఇరవై ఏళ్ళనుంచి తనదగ్గరపనిచేస్తున్న గుమాస్తాకి ఓ రూపాయి జీతం పెంచడానికి ఆయన మనసు ఒప్పదు.

క్రమంగా తనయిల్లు జ్ఞాపకం వచ్చింది గోపాలానికి. క్రితంరాత్రి వచ్చినవానకి ఇంట్లో ఎక్కడ జూచినా కురవడమే. కప్పునుంచి పడుతున్న వర్షపుధారలకింద పిడత, బిందె, చేద, చెంబు వగైరాలు గతరాత్రియింట్లో ఏవిధంగా పరుచుకునికూర్చున్నాయో కళ్ళకుకట్టినట్టుయింది. ఇక తనరెండోకొడుకుజబ్బుతో పడున్నగది అబ్బాయిమీద వాన పడకుండా దూలంనుంచి వేలాడేసిన తాటాకు గొడుగు, దానిమీద పైనుంచి తెల్లవార్లూ టప్‌టప్‌మని పడుతూ చుట్టూ చిందిన చినుకులు; ఆ గొడుగుకింద కోడుపోయిన ఓకుక్కిమంచం, ఆ కోడుపోయిన చోటులో మంచం భారాన్ని మోస్తున్న ఒక రోలు; ఆ మంచాన్ని అంటిపెట్టుకుని మూలుగుతూ పడివున్న తన రెండోకొడుకు- క్రమంగా స్మృతిపటంమీదికి వచ్చారు. అబ్బాయి పరిస్థితి ఏం బాగోలేదు. రోగం ఏమీ తగ్గుముఖం పట్టినట్లు కనపడదు. క్రమంగా ఆ రోగం వాడిని పీల్చి పిప్పిజేసేస్తోంది. కళకాంతులులేకుండా అయిపోయి పాలిపోయిన ముఖం, ఈనుపుల్లలా అయిపోయిన కాళ్ళు చేతులు, ఒక్కమాటలో చెప్పాలంటే కేవలం అస్థిపంజరంలా అయిపోయిన కొడుకు జ్ఞాపకం వస్తుంటే గోపాలంకళ్లు చెమ్మగిల్లాయి. ఒక్కవిషయంమరీ బాధిస్తోంది గోపాలాన్ని. ఇంటికి వెళ్ళగానే "నాన్నా బత్తాయికాయ తెచ్చావా" అంటాడు రోగంతో పడుతున్న తనకొడుకు. లేదని చెప్పలేక "ఇదిగో రేపు తెస్తాగా" అంటూ మూడురోజుల నుంచి గడుపుతున్నాడు గోపాలం నిత్యదారిద్ర్యం మూలంగా. మామూలుగా దొరికే ఆ నలభై అయినా యింకా ఆ నెల ముట్టలేదు.

ఊళ్ళో ఆసుపత్రులకు లోటులేదు. పెద్దపెద్ద గవర్నమెంటు ఆసుపత్రులు మూడున్నాయి. అక్కడ ఉచితవైద్య సహాయం జరుగుతుందంటే కొడుకుని తీసికెళ్ళాడు గోపాలం. అబ్బాయికి యింజెక్షన్లు అవసరం అన్నారు; అయితే ఇమ్మన్నాడు గోపాలం. అవి తమదగ్గర వుండవు

అన్నారు; అయితే ఇయ్యరా అని అడిగాడు గోపాలం. మీరు కొని తెచ్చుకుంటే మేం ఉచితంగా చికిత్స చేస్తామన్నారు. అదేగాబోలు ఉచిత వైద్యసహాయం అంటే అనుకున్నాడు గోపాలం. అప్పట్నించి కొడుకుయొక్క చికిత్సను పక్కవీధిలోని అవధాన్లుగారు మంత్రించియిచ్చే విభూతికి వదిలిపెట్టక తప్పిందిగాదు. గృహపరిస్థితులు చక్కబడాలంటే ముందు తన యింక్రిమెంటు సంగతి తేల్చుకోవాలి. ఆసంగతి ఆవేళ అడిగేసి తేల్చుకోవాలని పట్టుదలగానే వుంది.

గోపాలం ఈవిధమైన భావపరంపరలతో సతమతమవుతూంటే ఒకపెడ కాడపోయిన కళ్ళజోడు వదులుగా ముక్కుమీదకు జారింది. చెవికి మెలిపెట్టుతున్న దారం బిగించి దాన్ని సరిచేసుకున్నాడు. ఎడంపక్క ఆకాడ విరిగిపోయి ఏడాది కావస్తోంది. మళ్ళీ పెట్టించుకోవడం పడలేదు.

కుడికంట్లోంచి అలుక్కుపోయిన ప్రపంచం కనిపిస్తుంటే కిటికీలోంచి బయటికి చూస్తున్న గోపాలం నిట్టూర్చాడు. కళ్ళజోడు ఫ్రేములోని ఖాళీగుండా చూపుడువేలు సూటిగా పోనిచ్చి కంటిని ముట్టుకున్నాడు. ఆ పక్కకంటిఅద్దం పోయి మూడేళ్ళుఅయింది. అద్దం విడిచివెళ్ళిన ఖాళీలో వేలెట్టి గుండ్రంగా తిప్పాడు. ఎంత ఖాళీగావుంది—గుండె బావురుమంది. ఆ ఖాళీ ఎప్పటికైనా నింపడం పడుతుందో పడదోనని మథనపడుతూ గోపాలం తలనిమురుకుంటుంటే ఆవరణలోకివస్తున్న సుదర్శనంగారి కారుచప్పుడు వినిపించింది. గోపాలం అద్దెకొంపల చిట్టా తెరచి వసూలయిన అద్దెలను అందులో ఎక్కించడానికి పూనుకున్నాడు.

సుదర్శనం డ్రెస్ మార్చుకొచ్చి ఆఫీసుగదిలో కూర్చున్నారు. ఆవేళవచ్చిన టపా పట్టుకురమ్మన్నారు గోపాలాన్ని. గోపాలం ఉత్తరాలు పట్టుకొస్తున్నవాడల్లా హడలిపోయి ఆగాడు. సుదర్శనం ఉలిక్కిపడి కొయ్యబారినవాడిలా జూశారు. సంగతేమంటే సుదర్శనంగారి ఇల్లాలు మణమ్మగారు "ఏమండోయ్" అని అరిచింది ల్లు అదిరిపోయేట్టు. వాళ్ళు ఆవిధంగా చేష్టలు జూస్తుంటే ఏడేళ్ళవాడైన చిన్నకొడుకు శాన్ని సునాయాసంగా చంకనేసుకుని గుభుకు గుభుకు అంగలేసుకుంటూ గదిలో ప్రవేశించిందామె. కళ్ళల్లో ఘోరవిపత్తును చాటుతూ భర్తనుద్దేశించి "చూశారా" అందామె గిరి కాలుపైనున్న ఓ నలుసంత జోడుకాటును జూపిస్తూ. కార్యశూరులు సుదర్శనం వెంటనే కళ్ళజోడు సర్దుకుని పరీక్షగా జూశారు ఆ పిసరంత గాయం వైపు. అరచేతి మందానున్న ఆ భూతద్దాల కళ్ళజోడులోంచి ఆయనకు ఏ భూతంలా కనిపించిందోమరి ఆ నలుసంత గాయమూన్ను.

"ఆరిదేముడా" అంటూ దిగాలుపడిజూచి ఆయన టెలిఫోనువద్దకు పరిగెత్తారు డాక్టర్ని పిలవడానికి.

నిమిషాలమీదవచ్చారు డాక్టరు. గాయాన్ని నొక్కి నొక్కి పదినిమిషాలపాటు, పరీక్షించాడు. మందులబాధ తప్పించుకోవాలని జూశాడు గిరి. గాయం అసలు నొప్పిగానే లేదని చెప్పాడు. "అల్లాగే వుంటుంది ఆ రోగలక్షణం" అన్నాడు ఆ మాయడాక్టరు. ఆమాటలు వినేసరికి అంతటి సింహాసములైన న్యాయవాది బెంబేలు పడిపోయారు. రమణమ్మగారి సంగతి వేరేచెప్పాలా- "అమ్మో నాచిట్టితండ్రీ నీకెంతరోగం" అంటూ పమిటచెంగుతో ముక్కుచీదుకుంటూ విలపించిరణ.

"ఏమిటి తరుణోపాయం"అన్నట్లు జూస్తు వృద్ధదంపతులనుద్దేశించి "ఇంజెక్షన్ అవసరం" అన్నాడు డాక్టరు.

"అమ్మో నాకొద్దు. అదే తగ్గిపోతుంది" అన్నాడు గిరి.

"ఉత్తక్రమోహం" అంతా పోగయి ఇంజెక్షన్ ఇమ్మన్నారు డాక్టరుతో. ఆమాటవిన్నాడు గిరి. మరోనిమిషానికి అతనికి ఏడుపు వచ్చేస్తుంది. తార్కాణంగా అడుగు పెదవి పై పెదవిని పైపైకి నెట్టుకుంటూ గిజగిజ లాడింది. విచిత్రం ఏమంటే ఆ పై పెదవి ఎడమకోణంలో ఎగిరెగిరి అడుగు పెదవిని తాకసాగింది. క్రమంగా సహజంగా పెద్దవయిన అతని నాశికారంధ్రాలు బుస కొడుతూ అదరడం ప్రారంభించాయి. ఇంజెక్షన్ పొడిచీ పొడవగానే గిరికళ్ళు చికిలించుకున్నాయి. నోరు గభీమని పూర్ణపరిమితికి తెరుచుకుంది. అటుపిమ్మట"భారు"మనేసరికి బంగళాయావత్తూ ప్రతిధ్వనించింది.

అబ్బాయికి కొంచం రొంపభారంగా వుందన్న

కూడా తెలియజేసింది రమణమ్మగారు. చప్పిడి కూరలు పత్యం చెప్పాడు డాక్టరు. గిరికిమహా ఉడుకు మోత్తనంగా వుంది. "మరేపాపం చప్పిడి కూరలు పెడగురుగాని" అంటూ సణిగాడు మూతి ములక్కాయలా జేసుకుని.

రెండురోజులపాటు కాలు అట్టే కదపనియ్యకండి అని సలహాయిచ్చి వెళ్ళిపోయాడు డాక్టరు.

"రెండురోజులే! కాలుకదపకుండా!" అని వాపోవసాగాడు గిరి. అప్పటిదాకా డాక్టరు యిచ్చిన సలహాను ఎల్లా అమలు జరపాలా అనే అంశంమీద తీవ్రంగాయోచిస్తున్న సుదర్శనం మూడురోజులదాకా మంచం దిగవద్దని శాసించారు గిరిని.

"డాక్టరు చెప్తా రెండురోజులే డేడీ" అన్నాడు గిరి. సుదర్శనము సర్వజ్ఞుడిలా నవ్వి అన్నారు—

"శుద్ధ పిచ్చికుంకవిరా నాయనా. ఆయన చెప్పినది నువ్వు అర్థంచేసుకోలేదు. నీవు విశ్రాంతి ఎంత ఎక్కువ తీసుకుంటావో అంత త్వరగా ఆ గాయం మానిపోతుందని డాక్టరు ఉద్దేశం. అంతేగాని ఏదో మాటవరసకి రెండు రోజులు అన్నాడుగదా అనిచెప్పి రెండేరోజులు అనుకున్నావా!"

లోలోపల కుళ్ళికుళ్ళి ఏడ్చేడు గిరి తన చెఱ ఎంతకాలం పొడిగించనున్నారో అని.

వెంటనే పక్క పరిపించేశారు. వచ్చిన దుర వస్థకు దురపిల్లుతూ హతాశుడై గిరి మంచంమీద వాలిపోయాడు.

ఇదంతా చూస్తున్న గోపాలానికి ప్రపంచంలో ప్రతీదీ అపసవ్యంగావున్నట్లే తోచింది. తనవంటివాళ్ళ ఇళ్ళల్లో పెద్దపెద్ద జబ్బులుచేసి మంచానబడినవాళ్లకి మందు ఇప్పిద్దామంటే డబ్బుండదు. శ్రీమంతుల ఇళ్ళల్లో జోడు కాటుకి కూడా ఇంజెక్షన్లు కనిపెట్టుకునివుంటాయి.

ఇంతలో టెలిఫోన్ మోగింది. గోపాలం వెళ్లి విచారించాడు. అవతలపక్క మాట్లాడేది సుదర్శనంగారి అద్దెకొంపల్లో ఓదాంట్లో కాపరం వుంటున్న శివయ్యగారని తేలింది. గత రాత్రి వచ్చిన వానకి యిల్లంతా కురిసిందని ఫిర్యాదు.

ఆ ఇల్లు ఆమధ్య ఎప్పుడూ సరిగ్గా వేయించకపోయినా వృత్తిధర్మం నెరవేర్చాలిగా మరి. అందుకని సుదర్శనంగారికి కూడా వినబడేలా గట్టిగా అన్నాడు టెలిఫోన్‌లో.

"మొన్నమొన్ననే కదండీ కప్పు అంతా వేయిస్తా." అవతలాయన మండిపడ్డాడు—"మొన్ననే అంటారేమండీ అన్యాయం ఎనిమిదేళ్ళకు పైగా అయితేనూ వేయించి."

అద్దెకున్నవాళ్లు అలాంటి కంప్లేంటు పట్టుకొచ్చినప్పుడు ఏవిధంగా జవాబుచెప్పాలో సుదర్శనంగారివద్ద తరిఫీదుమూలంగా గోపాలానికి తడుముకోవలసిన అవసరం వుండదు. అలాంటి జవాబులు అతని నాలిక్కి పట్టేశాయి; మామూలుగా అనేశాడు—"ఎనిమిదేళ్ళు అయిందే అనుకోండి వేయించి. అంతమాత్రాన అప్పుడే పాడయిపోవాలని ఎక్కడుంది. ఏ కోతులనో ఎక్కనిస్తున్నారన్న మాట."

"నయం ఇంకా నేనే ఎక్కుతున్నాను అన్నారుగాదు. స్వయంగా సుదర్శనంగారితో మాట్లాడాలి. ఉన్నాగా వారు అక్కడ" అన్నాడు శివయ్య.

ఆ విషయం సుదర్శనంగారికి తెలియచేశాడు గోపాలం.

"ఏం మాట్లాడాలంటాడు" అని అడిగారు సుదర్శనం.

"ఇల్లు నేయించాలిటండి" అన్నాడు గోపాలం.

"మాకు వీలున్నప్పుడు నేయిస్తాంఅని చెప్పు. ఉండడానికి ఇష్టంలేకపోతే బయటికి నడవమని చెప్పు. అంతకు రెట్టింపు అద్దె యిచ్చేవాళ్ళు బోలెడుమంది వున్నారు" అన్నారు సుదర్శనం. శివయ్యగారికి ఆ మాట మృదుభాషలో అందజేశాడు గోపాలం.

ఆ తర్వాత "అనాథశరణాలయంవారు వ్రాశారు" అంటూ ఓ ఉత్తరం పట్టుకొచ్చి ఇచ్చాడు గోపాలం. దేన్నిగురించి అని అడిగారు సుదర్శనం ఉత్తరం చదవకుండానే. ధారాళంగా విరాళాలిమ్మని ప్రజలకు విజ్ఞప్తిచేయడానికి ఆ సంస్థవాళ్లు ఓ సభ ఏర్పాటుచేస్తున్నారని, అందులో సుదర్శనంగారిని ఉపన్యసించమని కోరారని తెలియచేశాడు గోపాలం.

"ఓ! ఉపన్యాసమేగదా. అలాగేనని వ్రాసేయండి" అన్నారు సుదర్శనం.

ఏ అంతస్థు సుఖంపొందేది పూర్తిగా పూర్వజన్మ పరిపాకంమీద ఆధారపడివుంటుంది. అంతేగాని మనిషికివచ్చే దురవస్థలకల్లా మూలకారణం డబ్బు లేకపోవడం అనుకోడం శుద్ధమానసిక దౌర్బల్యం."

సుదర్శనం ఈవిధంగా ఉపన్యసిస్తూండగా "బిచ్చం పెట్టించడమ్మా" అని ఆవరణలోంచి అరుపు వినిపించింది. తన వాగ్ధోరణికి అంతరాయం కలిగినందుకు ముష్టివాడిమీద మండిపడ్డారు సుదర్శనం "అంతగట్టిగా అరుస్తావేం వెధవా" అంటూ.

తాను నోరెత్తకుండావుంటే బిచ్చం పెడ తారు గాబోలుననీ ఆశించి మౌనంగా మెట్ల దగ్గరే నిల్చాడు బిచ్చగాడు.

ఇంతలో సుదర్శనంగారి జాగిలం లోపల నుంచి గదిలోకివచ్చింది. అది మెల్లగా సుదర్శనం వద్దకు చేరి తోక ఆడించసాగింది. మెడపై తట్టి ఆ కుక్కను బుజ్జగిస్తూ ఆయన మళ్ళీ చెప్ప సాగారు.

"ఏజాతియొక్క ఔన్నత్యమైనా పరిస్థితు లకు అనుగుణంగా జీవితవిధానాలను మార్చుకుని నడచుకోవడంలోనే వుంది. ఒకవేళ అవసర మైతే ప్రజలు తమతమ జీవితావసరాలను తగ్గించు కోవాలి. మనిషి ఏ పరిస్థితికైనా అమరేలా తయారుకావాలంటే ముందు నిరాడంబర జీవనం అలవర్చుకోవాలి. డబ్బు మహాపాపిష్టిది-దాని మీద మమకారం చంపుకోవాలి."

ఆయన అల్లా మాట్లాడుతున్నాడేగాని చేతులు జేసే పనులు చేతులు చేస్తూనేవున్నాయి. చిర కాలపు అభ్యాసంమూలంగా ఆ చేతులు బల్లపై సొమ్ముతీసి యాంత్రికంగా డ్రాయర్లో పెట్టే స్తున్నాయి. ఇంతలో పొరపాటున ఓ నాణెం చేజారి కిందబడి మోగింది.

"లైటు వెయ్యండి" అన్నారు సుదర్శనం. స్విచ్ నొక్కి లైటు వెలిగించాడు గోపాలం. వర దలా వచ్చిపడిన కాంతిలో జాగిలం మెడలోని వెండిమువ్వలు, సుదర్శనంగారి బంగారుపన్ను మిలమిల మెరిశాయి. "ఈయనేనా ఇందాక ట్నించీ నిరాడంబర జీవితంగురించి మాట్లాడుతూ న్నది" అనిపించింది గోపాలం మనసుకి.

నేలమీద పొట్ట ఈడ్చుకుంటూ సుదర్శనం మోకాళ్ళమీద మోచేతులమీద నానాఅవస్థపడి పాకుతూ ఎటో దొర్లిపోయిన నాణెంకోసం గదిలో ప్రతి అంగుళం గాలిస్తుంటే "డబ్బుమీద మమకారం చంపుకోవాలని ఈయనేగా ఇందాక ట్నించి ఉపదేశించినది" అనుకున్నాడు గోపాలం.

మొత్తంమీద ఆ నాణాన్ని ఓ బీరువాకింద పట్టుకున్నారు సుదర్శనం. ఇంతాజేస్తే అదో రాగికానీ. దాన్ని పదిలంగా చేతబుచ్చుకుని లేచి నిలబడి గుడ్డలుకట్రా దులుపుకున్నారు. తిరిగి యథాస్థానమైన తిరుగుడు కుర్చీలో ఆసీనులయి అన్నారు.

"మీతో కలిసి మెలిసివుంటూ మీ కష్టాలు సమస్యలు నాకు తప్ప మరెవరికి తెలుస్తాయి ఆఁ...అన్నట్టు...ఇందాకా చెబుదా మనుకుని మరిచాను. నేను వచ్చే ఎన్నికల్లో ఈ నియోజక వర్గంనుంచి నిలబడుతున్నానోయ్ గోపాలం."

గోపాలం మాట్లాడక వూరుకున్నాడు. సుద ర్శనం ఓక్షణంపోయాక "మీ కష్టాలన్నీ తొలగి పోవాలంటే మీరంతా నాకు ఓటు ఇవ్వడం మంచిది" అన్నారు.

"ఓహో అల్లాగా" అంటూ విషాదంగా నవ్వాడు గోపాలం. ఆ నవ్వులో ఏదో పరిహాసం కూడా ధ్వనించినట్లయి సుదర్శనం ఏదో గుచ్చు కున్నట్లు చూస్తూ వుండిపోయాడు.

గోపాలంలో ఇరవై ఏళ్ళ సర్వీసులోనూ ఎంతోలోతు అణగారిపోయిన వ్యక్తిత్వం తొలి సారిగా నిర్భయంగా తలెత్తింది. అతను తొలి సారిగా ఎలుగెత్తి మాట్లాడాడు.

"మీకు వోటు వేయడంకంటె మెడకు వురి పోసుకోడం మంచిది" అప్రయత్నంగా వచ్చే శాయి అతని నోటమ్మట ఆ మాటలు.

ఎప్పుడూ లేనిది గోపాలం అల్లా మాట్లాడు తూంటే సుదర్శనం చేష్టలు దక్కి చూడసాగాడు.

గోపాలానికి లోపల రగులుతోంది. ఉద్రేకం అణచుకోలేక మళ్ళీ అన్నాడు.

"ఇరవై ఏళ్ళనుంచి మిమ్మల్ని నమ్ముకున్న వాడికి ఓరూపాయి జీతం పెంచాలంటే మీ మనసు ఒప్పదు. మీ అబ్బాయి పేకాటల్లోనూ రేసుల్లోనూ వందలు వేలు ఖర్చు పెడుతూంటే అదంతా అవసరమైన ఖర్చులాగే అనిపిస్తుంది మీకు. ఇరవై ఏళ్ళనుంచి ఎప్పుడు జీతం పెంచ

మని అడిగినా నిరాడంబర జీవనం, జీవితావసరాలు తగ్గించుకోవటం గూర్చి ఉపదేశిస్తారు."

ఈవిధంగా ఉద్రేకంగా అనేస్తున్న గోపాలానికి సగం పక్కకు తొలగిన గుమ్మం తెర మూలంగా పక్కగదిలోని తలుపులు తెరుచుకుని వున్న జోళ్ళబీరువా కంటబడింది. ఆవేశంగా అన్నాడు.

"మీకు మాత్రం 33 జతల జోళ్లు వుండాలి. ఇంట్లో రెండు కార్లు వుండాలి. ఆవరణలో రెండు కుక్కలుండాలి. వాటి మెడలో వెండి ముక్కల పటకాలుండాలి. మీ పళ్ళకి బంగారు తొడుగులుండాలి. ఇవన్నీ అవసరమైన ఖర్చులు. కూటికి గుడ్డకి కరువాచి పూర్తిగా మిమ్మల్నే నమ్ముకుని ఇరవై ఏళ్ళనుంచి చాకిరీ చేస్తున్నవాడికి జీతం పెంచడానికి మాత్రం మనసు ఒప్పదు."

"కమ్యూనిస్టు!" అంటూ వికృతంగా అరిచారు సుదర్శనం.

గోపాలం విరగబడి నవ్వి "ఈ బంగళా కమ్యూనిస్టులను సృష్టించే కర్మాగారం గాక మరేమిటి" అని ప్రశ్నించాడు. సుదర్శనం విస్తుబోయి జూశారు.

"దేశంలో కమ్యూనిజం మీలాంటివాళ్ళ మూలంగానే వస్తుంది. క్రిందివాళ్ళపై మీకుండే నిర్దాక్షిణ్యమే కారణం, మీబోటివాళ్ళపై మాకు ఏర్పడే అసంతృప్తి మమ్మల్ని కమ్యూనిస్టులుగా మార్చక వూరకబోతుందా" అని ఆగాడు గోపాలం.

అంతవరకు బిచ్చం పెడతారేమోనని ఆశగా బయట నిలబడిన ముష్టివాడు మెట్లెక్కి పైకొచ్చి "బిచ్చం పెట్టించండి బాబయ్యా" అన్నాడు మెల్లగా.

"ఇంకా పోలేదురా వెధవా. ఎక్కడ జూచినా వెధవసంత పోగవుతోంది నాకు" అంటూ భగ్మన్నాడు సుదర్శనం. లోపలున్న కుక్క "భౌంయ్" మంది ముష్టివాడిమీద, "ఎందుకురా వృథాప్రయాస ఇక్కడ అరుస్తావు. చిన్నచిన్న కొంపల దగ్గరికిపోయి అడుక్కుంటే ఉన్నదాంట్లోనే రవ్వంత పెడతారు పాపభీతి చేతైనా" అంటూ జేబులోంచి ఓ కానీతీసి వాడివైపు విసిరాడు గోపాలం.

తాను పొమ్మన్న బిచ్చగాడికి గోపాలం కానీ యిచ్చినందుకు సుదర్శనం దెబ్బతిన్నట్లు జూశారు. ముష్టివాడు ఆత్రుతగా ఆ కానీ అందుకుని అనేక దీవనలు జెబుతూ వెళ్ళిపోయాడు.

ఇక అక్కడ పని జేయవల్సిన అవసరం వుండదని గోపాలానికి తెలుసు. కండువా పైమీద వేసుకుని బయల్దేరాడు. సుదర్శనం వరండాలోకొచ్చి మెట్లుదిగి వెళ్ళిపోతున్న గోపాలంవైపు చూస్తూ నిలబడ్డారు. అప్పుడే అక్కడికి వచ్చిన కొడుకుతో అన్నారు

"చూశావా గణేష్. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పట్టుమని పదేళ్ళయినా కాలేదు. ఉన్నపళంగా ఐశ్వర్యాలు వచ్చిపడాలంటే జరిగే విషయమా. జీతం పెంచలేదని చూశావా గోపాలంగాడి పొగరు. నానామాటలు అని ఎల్లా పోతున్నాడో, నిజానికి నాది బహు జాలిగుండె. అందుకే వీళ్లు నన్ను నెత్తెక్కి తొక్కజూస్తారు."

"నిజమే డేడీ. మీది బహు జాలిగుండె" అని ఓదార్చాడు గణేశం. పిమ్మట ఏదో పనిమీద వచ్చినవాడిలా మొహం పెట్టి "డేడీ నాకు అర్జంటుగా ఐదువందలు కావాలి" అన్నాడు గణేశం.

ఎర్రటి ఏగాణీకూడా లేదన్నారు సుదర్శనం. పిమ్మట డ్రాయరుకు తాళం వెయ్యలేదని గుర్తొచ్చి గదివైపు త్వరగా అడుగులిడుతూ నడిచారు సుదర్శనం. తండ్రికంటె ముందు గదిలోకి జేరుకోవాలని జూశాడు గణేశం. కాని అతనిదారికి అడ్డంవచ్చి నడవసాగారు సుదర్శనం. వాళ్ళ సంభాషణవింటూ మెట్లుదిగిన గోపాలం వెనుదిరిగి జూశాడు. ఒండొరులను నెట్టుకుంటూ గదిలోకి పందెంగుర్రాల్లా పరిగెడుతున్న తండ్రీ కొడుకులనుజూసి పరిహాసంగా నవ్వాడు గోపాలం. ఆ నవ్వుకు ఓక్షణం ఆగి తండ్రీ కొడుకులు ఒకరి మొహం ఒకరు జూసుకుంటూంటే గోపాలం క్రమంగా ఆ శ్రీమంతుని బంగళావీడి బయటప్రపంచంలో దారి తీశాడు.